# గాజులూ - గొలుసూ

రాజారావు ఆఫీసునుండి రాగానే లలిత ఒక్కగంతున వచ్చి కాళ్ళకు చుట్టుకుంది. "నాన్న నేనొకటి అడుగుతా చెప్పవూ ? అమ్మ నడిగితే కోప్పడుతున్నది నాన్నా..." అని ముద్దుగా అడిగింది రాజారావు కోటువిప్పి వంకెకు తగిలిస్తూ లలితను దగ్గరకు తీసుకున్నాడు.

"అడుగు...ఏమిటో అది...." అన్నాడు రాజారావు.

"నేనో పుస్తకంలో దొంగలను గురించి చదివాను నాన్నా... వాళ్ళు ఏ జాతికి చెందినవాళ్ళో చెప్పవూ ?"

ఇలాంటి ప్రశ్న వేస్తుందని రాజారావు అనుకోలేదు. లలిత తొమ్మిది లేక పదేళ్ళ ప్రాయంది. తన ఈడుగల మిగతా పిల్లలకంటే ఈమెలో ఓ ప్రత్యేకత ఉంది. అల్లరి చేయక పోవడం; ఎప్పుడూ ఇంట్లోకూర్చుని ఏవో పత్రికలూ పుస్తకాలూ చదువుకోవడం లలితకు ఇష్టం. ఇదేం మనస్తత్వం ఆడుకోడానికైనా బయటకు వెళ్ళదు....అని అనుకుండేవాడు రాజారావు. దురదృష్టవశాత్తూ తనేదో పత్రికాఫీసులో పని చేయడం...ఆ కారణంగా తనకు వచ్చిన పత్రికలూ పుస్తకాలూ ఇంటికి తీసుకు వస్తూండేవాడు రాజారావు. కొత్త కొత్త విషయాలంటే లలితకెంతో సరదా. బొమ్మల పత్రికలంటే మరీ ఇష్టం. వీటన్నిటికంటే మరో ప్రత్యేకత ఏమిటంటే తల్లి అంటే అమిత గౌరవం. తల్లిమీద ఈగ వాలనివ్వదు. ఎప్పుడైనా ఆమె నిద్రపోతుంటే, ఎవరైనా నిద్రాభంగం

చేస్తారేమోనని కాపలా కాసేది లలిత. దాసీదాన్ని దగ్గరగా మాట్లాడనిచ్చేదికాదు. నిద్రపోతూంటే మా అమ్మ చాల అందంగా ఉంటుంది. సుఖంగా నిద్రపోతున్నది...అని అనుకుంటూ పరిసరాలు తానుకూడా నిశ్శబ్దంగా ఉండటానికి ప్రయత్నించేది. నాన్న ఆఫీసుకు వెళ్ళిపోయి, అమ్మ నిద్రపోతుంటే తను గదిలో కూర్చుని పుస్తకాలు తిరగేసేది.

లలిత వేసిన ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలో తెలియలేదు. రాజారావు "చిట్టితల్లి...అలాంటి విషయాలు ఆలోచించి బుర్ర చెడగొట్టుకోకమ్మా..." అంటూండగానే... రాజారావు భార్య ముసిముసినవ్వులతో...అస్తమానం వేధించుకు తింటోంది ఆ ప్రశ్నతో. జవాబు చెప్తేనేగా అన్నం తినదట అన్నది భర్తవైపు చూస్తూ. ఇద్దరూ సగర్వంగా ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకున్నారు.

"వాళ్ళూ మనలాగే మనుషులేనమ్మా..." అన్నాడు రాజారావు లలితను ముద్దాడుతూ "అయితే వాళ్ళకెవరూ దొంగతనం చేయకూడదని పాఠం చెప్పలేదా ?" అంది లలిత రాజారావు వళ్ళోకూర్చుని.

ఈ ప్రశ్నకూ రాజారావు, భార్యా నవ్వుకున్నారు. లలిత కోపం వచ్చినట్లు మూతి బిగించింది.

దొంగలను గురించి ఆలోచించకు, కలలు వస్తాయి అది మరచిపో...మరేదైనా చదువుకో అన్నాడు రాజారావు.

o o o o

నాలుగు రోజులయిన తరువాత దాసీది..."అమ్మగారూ ఊళ్ళో దొంగల హడావుడిగా ఉంది... మొన్నటిరోజు సవరం వారి వీధిలో దొంగలుపడి నాలుగువేల రూపాయల సొమ్ము ఎత్తుకుపోయారట...అదృష్టం — ఇంట్లోవాళ్ళ ప్రాణాలు దక్కినయి—" అని అన్నది అంట్లు తోముతూ...గదిలో చదువుకుంటున్న లలిత ఈ మాటలువిని ఉలిక్కిపడి ఒక్క గంతువేసింది అమ్మా...అని.

ఆ రాత్రంతా దొంగలను గురించి ఆలోచించింది లలిత. నిద్రపట్టలేదు. గాఢనిద్రపోతున్న తల్లివైపు అప్పుడప్పుడూ చూసి మళ్ళీ పడుకున్నేది. లలిత ఇంకా ఆ విషయమే ఆలోచిస్తున్నదని రాజారావు అనుకోలేదు...దాని విషయమై పట్టించుకోలేదుకూడా. దొంగవస్తే అమ్మకు నిద్రాభంగం కలుగుతుందని తప్ప మరో భయంలేదు లలితకు. ఏమాత్రం చప్పుడైనా చటుక్కున లేచి కూర్చుండేది ఎంత నిద్రలో ఉన్నా.

° ° ° °

రాజారావు పనిమీద నాలుగు రోజులు ఊరు వెళ్ళాడు. లలిత మామూలుగానే పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేస్తున్నది. దొంగలను గురించి విన్నప్పటినుండి భయంవల్ల కాబోలు ఎందుచేతనో సరిగా నిద్రపోవడంలేదు.

ఒకరోజు....

రాత్రి రెండు గంటలు కావస్తోంది. నాన్న ఊళ్ళో లేదు అమ్మ గదిలో నిద్రపోతున్నది. తాను పక్కనే పడుకుని ఉన్నది. అంతా నిశ్శబ్దం—ఉన్నట్లుండి...లలితకు మనిషి అలికిడి అయినట్లు వినిపించింది. క్రమంగా ధ్వనికూడా పెద్దది కావడం ప్రారంభించింది. అమ్మవైపు చూసింది. అమ్మ సుఖంగా నిద్రపోతున్నది. దొంగే అయి ఉంటాడు లేకపోతే ఇంత అర్ధరాత్రి ఎవరు వస్తారు అని అనుకుంది లలిత. మంచం మీదనుండి క్రిందకుదిగి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ చప్పుడు కాకుండా...(అలికిడి అయితే అమ్మకు నిద్రాభంగం కలుతుందేమో) ముందుకు వచ్చి నిల్చున్నది. క్రమంగా దొంగ తనను సమీపిస్తున్నాడు. దొంగను చూచింది లలిత. గబగబా ముందుకువెళ్ళి అతని దగ్గరగా...ఏయ్... నిన్నే ఇస్...చప్పుడు చేయబోకు....మా అమ్మ నిద్రపోతున్నది అని అన్నది. దొంగ లలితను చూశాడు. చప్పుడు చేయనంటేనే లోపలకు వెళ్ళనిస్తాను. లేకపోతే తిరిగి వెళ్ళవలసిందే. దొంగ లలిత ఎదురుగా నిల్చుని ఉన్నాడు. ఎక్కడ ఏమేం ఉన్నాయో చెప్తావా ? అన్నాడు.

"ఓ" అంటూ...రహస్యంగా ప్రారంభించింది. పడమటి గదిలో మా అమ్మ నిద్రపోతున్నది. నీవు ఆ వైపుకే పోవడానికి వీల్లేదు. వంటయింట్లో మూడు వెండికంచాలున్నాయి. అవతల గదిలో అల్మైరాలో మా నాన్న పుస్తకాలూ, బట్టలూ ఉన్నాయి...అవును గానీ నీవు మనిషివి బాగా ఉన్నావ్. దొంగతనం చెయ్యమని ఎవరు చెప్పారూ. ఎక్కడా ఉద్యోగం దొరకలా, నీవేమైనా చదువుకున్నావా. బాగా

చదువుకుంటే మా నాన్నగారితో చెప్పి ఏమైనా ఉద్యోగం దొరుకుతుందేమో కనుక్కొంటాను. ఉద్యోగం చేస్తావా ?... అంటూ దొంగవైపు చూస్తున్నది.

దొంగ పెద్దగా ఏదో మాట్లాడపోయేటప్పటికి ఏయ్... ఇస్ ...నిశ్శబ్దం...మా అమ్మ నిద్రపోతున్నదని చెప్పలేదూ. అని గదమాయించింది. నేనిక్కడ నిల్చుంటాను లోపలకు వెళ్ళి ఉన్నవన్నీ తీసుకుని నాకియ్యి. అన్నాడు దొంగ.

"మా అమ్మ నిద్రపోతున్నది. ఆమె మెడలో గొలుసు ఉన్నది. ఆమె పడుకున్న గదివైపు కూడా మనం వెళ్ళకూడదు. నేను వెళ్ళనూ అని పట్టువేసుకుంటే అవన్నీ తీసుకు వస్తాను అన్నది లలిత, సరే నన్నాడు దొంగ.

ఆ వెండి కంచాలలో ఒకటి మా నాన్నది. రెండోది మా అమ్మది. ఆ రెండూ తాకటానికి వీల్లేదు. ఆ పుస్తకాలు కూడా మా నాన్న ఎంతో కష్టపడి కొనుక్కొన్నారు. అవి కూడా ఏమీ ముట్టుకోవడానికి వీలులేదు అని అన్నది లలిత.

అన్నిటికీ అన్నీ చెప్తున్నావు ఏదో ఒకటి ఇస్తేగాని వీలులేదు అన్నాడు దొంగ.

"మా మాన్న నాకో గొలుసు చేయించాడు. నా చేతికి గాజులున్నాయి. నా దగ్గర కొన్ని బొమ్మలున్నాయి. కొన్ని చిన్న పుస్తకాలున్నయి. కావలిస్తే ఇవన్నీ పట్టుకుపో. అంతే కాని, నాన్నవి, అమ్మవి ఒక్క వస్తువు తాకడానికి వీలులేదు. ఇవన్నీ తీసుకుని శబ్దం చెయ్యకుండా తిరిగి వెళ్ళిపో" అన్నది లలిత.

దొంగకు ఏం మాట్లాడాలో తోచలేదు. అలాగే నిల్చు న్నాడు. ఇంతలో తన చేతులకు ఉన్న గాజులూ, గొలుసూ తీసి అతని చేతికిచ్చింది. దొంగ నీ పేరేమిటి ? అన్నాడు. 'లలిత' అని ముద్దుగా చెప్పింది. అయితే వెళ్ళిపోతావన్నమాట అన్నది" "వెళ్ళమన్నావుగా" అన్నాడు దొంగ. తరవాతయినా హాయిగా గౌరవంగా ఉద్యోగంలో చేరితే మంచిది అన్నది లలిత. దొంగ ముందు వెళ్తున్నాడు. వెనుక లలిత వస్తున్నది.

వాకిటిదాకా దొంగను సాగనంపి వచ్చి లలిత పడు కున్నది.

ం ం ం ం

తరువాత రెండు రోజులకు రాజారావు వచ్చాడు. అప్పటి వరకూ ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు లలిత.

జరిగిన విషయమంతా చెప్తూ వాడికెక్కడన్నా ఉద్యోగం చూసిపెట్టకూడదూ ? పాపం దొంగతనం మానేస్తాట్ట అన్నది.

ఎంత దానివే లలితా నీవు. అని తల్లితండ్రులిద్దరూ లలితను కౌగలించుకున్నారు. "కొప్పడకు నాన్నా నన్ను గాజులూ గొలుసూ ఇచ్చేశాను." అని ముద్దుగా అంటుంటే ఇద్దరూ ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకున్నారు.

ం ం ం ం

దొంగ తరువాత పట్టుబడటం జరిగింది. పోలీసు ఇన్స్పెక్టరువచ్చి ఒకరోజు గొలుసూ గాజులూ రెండూ రాజారావు కిస్తూ "మీ అమ్మాయి చాల అదృష్టవంతురాలు అన్నాడు. దొంగ లలిత కివ్వమని ఒక ఉత్తరంకూడా పంపించాడు. "నీ వస్తువులు రెండూ నీకు పంపిస్తూ ఉన్నాను. నాకొకప్పుడు నీలాంటి 'పాప' ఉండేది. భార్య పిల్లలూ అంతాపోయి ఒక్కణ్ణి మిగిలాను. ఏ కారణంవల్లనో దొంగతనం వృత్తిగా ఏర్పడ్డది నాకు. అది ఈ రోజుతో సరి అనుకుంటాను. భగవంతుడిలా నీవు నాకు దారి చూపించావు. ప్రస్తుతం జైల్లో ఉంటున్నాను. మీ నాన్నగారితోనూ అమ్మగారితోనూ ఒక్కసారి నన్ను చూడటానికి వస్తే సంతోషిస్తాను." ఉత్తరం బిగ్గరగా చదివి వినిపించింది లలిత.

రాజారావు భార్యా ఇల్లు ప్రతిధ్వనించేట్లు నవ్వారు. పోదాం నాన్నా అనిమాత్రం అనగల్గింది లలిత.

సుభాషిణి

)-o-(